క్లుప్తంగా

కిటకిటలాడిన రాజనాలబండ



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, చౌడేపల్లెలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు స్వామివారికి పూజలు చేసి పాదముద్రికలపై నిలబడి ప్రమాణాలు చేశారు. భక్తుల రద్దీతో రాజనాల బండ ఆలయం కిటకిటలాడింది.

ఇళ్లలోకి మురుగునీరు వస్తోంది



ఎంపీడీఓకు సమస్యను విన్నవిస్తున్న మహిళలు

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బోయకొండ పాతరోడ్డు వీధిలో ఇళ్లలోకి మురుగునీరు వస్తోందని స్థానిక మహిళలు శనివారం ఎంపీడీఓ లీలామాధవికి వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని ఆమెను కోరారు. మురుగునీటి కాలువలు శుభ్రపరచక పోవడంతోపాటు వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి వస్తుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దోమల బెడద తీవ్రంగా మారిందని చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వేడుకగా హరినామస్మరణ భజన

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా హరినామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామి నామస్మరణతో మారుమోగింది. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని సంతగట్టు గ్రామానికి చెందిన రెడ్డెప్పరాజు తండ్రి శీనప్పరాజు శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సంతగట్టుకి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చింతమాకులపల్లికి చెందిన చిట్టిరెడ్డి కుమారుడు రేవంత్‌రెడ్డి శనివారం మృతిచెందాడు. జెడ్పీ చైర్మన్ చింతమాకులపల్లికి వెళ్లి నివాళులర్పించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- పలమనేరు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి



మద్యం దుకాణం వద్ద తనిఖీ చేస్తున్న సీఐ

పలమనేరు: మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్థానిక ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి హెచ్చరించారు. ఆమేరకు సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పట్టణంలోని మద్యం దుకాణాలు, బార్లను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణాల వద్ద తప్పక ధరల పట్టికలుండాలన్నారు. దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 వరకే ఉండాలన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లలో నిర్ణయించిన ధరకంటే ఎక్కువగా మద్యం అమ్మితే చర్యలు తప్పవన్నారు. మరికొందరు దుకాణాలు మూసేశాక రహస్య ప్రాంతాల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, త్వరలో వీరిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొత్తిమీరతో కాసులు

- ఆసక్తి చూపుతున్న రైతన్నలు
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- 45 రోజులకే పంట చేతికి



మేకలవారిపల్లెలో సాగుచేసిన కొత్తిమీర

చౌడేపల్లె: సీజన్ ఆధారంగా సాగు చేస్తున్న టమాట, కూరగాయల పంటలకు ఆశించిన మేరకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో కొత్త పంటలపై రైతులు దృష్టి సారించారు. తక్కువ పెట్టుబడితో పాటు కూలీలు అవసరం లేకుండా సులభతరమైన పంటలపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో కొత్తిమీర సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. వంటలకు ఘుమఘుమలను ఇస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి కొత్తిమీర దోహదపడుతోంది. మండలంలోని రైతులు కొత్తిమీర సాగుపై ఆసక్తిచూపుతున్నారు. మేకలవారిపల్లె, కరణంవారిపల్లె, ఊటూరు, వెంగళపల్లె, పాలెంపల్లె, కొత్తపల్లె ప్రాంతాల్లో వంద ఎకరాల్లో కొత్తిమీర సాగు చేశారు. ఎక్కువ శాతం మంది నాటు కొత్తిమీర కంటే



విక్రయానికి సిద్ధం చేసిన కొత్తిమీర కట్టలు

హైబ్రీడ్ సీడ్స్‌పై మక్కువ చూపుతున్నారు. అయితే నాటు కొత్తిమీరకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఈ పంటకోత కేవలం 45 రోజుల్లో వస్తోంది. కొత్తిమీరను కట్టల రూపంలో మార్కెట్లకు తరలించి మంచి లాభాలను గడిస్తున్నారు. పెట్టుబడి తక్కువగా పెట్టి దిగుబడిలో మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు సాధించడం సాధ్యమని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.15వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఒక ఎకరా పొలంలో రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం లభిస్తుంది. పంట దిగుబడిని బట్టి కొత్తిమీర తోటలను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడులు, కూలీల అవసరం లేకుండా లక్షలాది రూపాయలు నికరలాభం పొందుతున్నారు.

సాగు విధానం..

కొత్తిమీర సాగు కోసం ఎంపిక చేసిన పొలాన్ని బాగా దుక్కిదున్ని సిద్ధం చేయాలి. పొలానికి సరిపడా సేంద్రియ ఎరువులను వేయాలి. ఒక ఎకరా పొలానికి 30నుంచి 35 కేజీల ధనియాలు అవసరం ఉంటుంది. ధనియాలు విత్తిన తరువాత నీరు పారించాలి. కొత్తిమీర మొలకలు రాకమునుపే పిచ్చిమొక్కలు, కలుపుమొక్కల నివారణ కోసం రసాయనిక మందులు పిచికారీ చేయాలి. మొలకెత్తినప్పటి నుంచి నీరు సక్రమంగా పారించడంతో పాటు రసాయనఎరువులు వేయాలి. 45 రోజుల సమయంలో పంట దిగుబడి పొందవచ్చు.

పంట విక్రయం ఇలా..

దిగుబడికి వచ్చిన పంటను పిడికిలి సైజుగల చిన్నచిన్న కట్టల రూపంలో కూలీలతో ఏర్పాటుచేస్తారు. ఒక మూటకు 100 కట్టలు వేసి నింపుతారు. పస్తుతం మార్కెట్‌లో ఒక చిన్నకట్ట రూ.10 నుంచి 15 వరకు విక్రయిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన వ్యాపారులు కొత్తిమీరను అక్కడి నుంచి కూలీలను తీసుకొచ్చి టెంపోల సాయంతో మార్కెట్లకు తరలిస్తున్నారు. కర్ణాటక నుంచి ఆంధ్రాకు వచ్చి వ్యాపారం చేస్తున్నా కష్టానికి తగిన ఫలితం ఉందని అంటున్నారు.

కొత్తిమీర సాగే నయం

పంటలకు గిట్టుబాటు ధరలు సక్రమంగా లేకపోవడంతో ఈ ఏడాది కొత్తిమీర సాగుపై దృష్టి సారించాం. తక్కువ సమయంలో పంట చేతికొస్తోంది. ఆశించిన మేరకు లాభాలున్నాయి. ఇలాంటి పంటలు చేసు కుంటేనే మంచిదని భావించి దశల వారీగా పంటలను సిద్ధం చేస్తున్నాం.

– సామిరెడ్డి , రైతు, మేకలవారిపల్లె

కొత్త పంటలపై అవగాహన కల్పించాలి

కాలానికి అనుగుణంగా సాగు చేసే పంటలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా ప్రభుత్వం రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. రాయితీ ధరలతో పంటలకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి. సాగుచేసిన పంటలకు మార్కెట్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

–హేమంత్ పెద్దూరు, చౌడేపల్లె

నోటీస్ బోర్డు

నేడు ముత్యాలమ్మ పుష్పపల్లకి

రొంపిచెర్ల: ముత్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం రొంపిచెర్ల పురవీధుల్లో ముత్యాలమ్మ పుష్పపల్లకీ ఊరేగింపు జరగనుంది. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి 101 బిందెల పసుపు నీళ్లతో జలాభిషేకం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పురవీధుల్లో పుష్పపల్లకీలో ముత్యాలమ్మ ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

చౌడేపల్లె: స్థానిక మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం ఆవరణలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సత్సంగ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. పెద్దకొండామర్రి సమీపంలో సత్సంగ్ ఫౌండేషన్ సహకారంతో ది సేక్రెడ్ గ్రోవ్ వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

గుడుపల్లె: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాక్రిష్ణ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు.

ఆక్రమణలో మున్సిపల్ డ్రైన్లు

- కుచించుకుపోతున్న రాజ కాలువలు
- ఆక్రమణలను పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వర్షాలకు వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు



ఆక్రమణలో కుచించుకుపోయిన మదనపల్లి రోడ్డులోని రాజకాలువ, మేజర్ డ్రైన్లు



పలమనేరు: పట్టణంలోని పలు మేజర్ డ్రైన్లు ఆక్రమణకు గురయ్యాయి. మరికొన్ని కుచించుకుపోగా కొన్ని కనిపించకుండా పోయాయి. దీనిపై మున్సిపల్ అధికారులు ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడమే కారణమైందనే మాట పట్టణంలో గట్టిగా వినిపిస్తోంది. తీరా వర్షాలు వచ్చినప్పుడు వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేక ఏటవాలుగా ఉండే అటు వరద నీరు వీధుల్లో, ఇళ్లపై వెళుతోంది. ఇప్పటికే ఆక్రమణలు జరిగిన చోట్ల ఇళ్లల్లోకి సైతం వర్షపు నీరు చేరుతోంది. ఏటా మున్సిపల్ మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం రూ.4.5లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగానైనా ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఉంది.

పలుచోట్ల ఆక్రమణలు

స్థానిక మెయిన్‌రోడ్డులోని బాలికోన్నత పాఠశాల నుంచి కదిరప్ప ఆస్పత్రి వెనుకగా సరస్వతి కేఫ్ వెనుక వెళ్లే డ్రైన్ ఆక్రమణలకు గురైంది. కొత్తపేటలోని ఓంశక్తి ఆలయం నుంచి పెద్దచెరువులోకి వచ్చే రాజకాలువ పది అడుగుల నుంచి నాలుగైదు అడుగులకు కుచించుకుపోయింది. స్థానిక గుండుబావి వద్ద రాజకాలువపైనే కొందరు గోడలను కట్టారు. ఇదే కాలువపై కొందరు పక్కా భవనాలనే నిర్మించేశారు. ఇక గుడియాత్తం రోడ్డు నుంచి రాధా బంగ్లావైపునకు వెళ్లే డ్రైన్ ఎప్పుడో కనిపించకుండాపోయింది. దీనిపై నిర్మాణాలు, తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. ఆ వార్డు కౌన్సిలర్లు ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యపై పోరాడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం పట్టణ జనాభా 90వేలకు చేరుకుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఆక్రమణలు, మాయమైన కాలువలను సర్వే జరిపించి గతంలో ఉన్నట్టుగా చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం పూడికతీత పనులు మాత్రమే చేపడుతున్నామని తెలిపారు. ఆక్రమణల విషయమై ఆయన స్పందించకపోవడం కొసమెరుపు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని పాలమాకులపల్లె పిళ్లారిగుండు వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బోడబండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ ద్విచక్ర వాహనంపై పలమనేరు నుంచి బంగారుపాళ్యానికి బయల్దేరారు. పిళ్లారిగుండు వద్ద కేబుల్ వైర్లు వేసేందుకు గొయ్యి తీసి మట్టిని కుప్పగా వేశారు. ప్రమాదవశాత్తు మట్టికుప్పను ఢీకొని రహదారిపై పడ్డాడు. గాయపడ్డ అతన్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మామిడి రైతులను ఆదుకోండి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం మామిడి, టమాట రైతులను ఆదుకోవాలని సీపీఐ అనుబంధమైన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు సిరులు కురిపిస్తామంటూ చేస్తున్న వాగ్దానాలు కేవలం కంటి తుడుపు చర్యగా ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి, టమాట రైతాంగం గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా అధికారులు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. ఈ ఏడాది తోతాపురికి గిట్టుబాటు ధర రూ.30 కల్పించాలని అందులో ప్రభుత్వ ప్రోత్సాహకం కిలోకు రూ.5 అందజేయాలన్నారు.

సమాచార బోర్డు ఎక్కడ?

చౌడేపల్లె: ఉపాధి పథకం కార్యాలయంలో 2005 చట్టం ప్రకారం పౌర సమాచార బోర్డును అధికారులు ఏర్పాటుచేయడం విస్మరించారు. ప్రతిఏటా కోట్లాది రూపాయలతో ఉపాధి పనులు చేస్తున్న కార్యాలయంలో సమాచారం తెలుసుకునేందుకు ఎవరికి దరఖాస్తుచేయాలి, ఎవరిని సంప్రదించాలో పౌర సమాచార అధికారుల వివరాలు సైతం ఏర్పాటుచేయకపోవడం శోచనీయం. ఇకనైనా అధికారులు స్పందించి పౌర సమాచారం వివరాలతో బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కంపోస్టు చెత్తకు మోక్షం ఎప్పుడో?

- పలమనేరులో బయో ఎనర్జీ ప్లాంట్ పూర్తయ్యేనా?
- డంపింగ్ యార్డు వద్ద మొదలు కాని పనులు
- గతంలో క్యూబ్, ఇప్పుడేమో జిగ్మా కంపెనీ
- డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త



పలమనేరులోని డంపింగ్ యార్డు

పలమనేరు: పట్టణ సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో బయో ఎనర్జీ ప్లాంటు పనులు మొదలై ఎన్నో ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు మొదలు కాలేదు. దీంతో పట్టణం నుంచి నిత్యం వచ్చే తడి, పొడి చెత్తను వేరుచేసిన వ్యర్థాలతో డంపింగ్ యార్డులో పేరుకుపోతోంది.



యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

ఇందుకోసం అవసరమైన స్థలం సదుపాయాలను క్యూబ్ సంస్థ నిర్వాహకులకు స్థానిక మున్సిపల్ అధికారులు గతంలోనే చూపెట్టారు. ఈ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఫలితం లేదు. ఇలాఉండగా ఇప్పటిదాకా పేరుకుపోయిన చెత్తను ఎరువుగా మార్చేందుకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థకు అప్పగించింది. ఈసంస్థ అక్టోబర్ 2 కల్లా పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసి ఎరువుగా మార్చాల్సి ఉంటుంది. కానీ గతంలో ఇక్కడ ఈ పనులు చేపట్టిన కంపెనీనే సక్రమంగా చేయలేదు. ఇప్పుడొచ్చే కొత్త కంపెనీ అక్టోబర్‌లోపు పూర్తి చేయడం అసాధ్యంగానే కనిపిస్తోంది.

సక్రమంగా పనులు చేయని క్యూబ్ సంస్థ

స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసే ప్రాజెక్టులకు 2015 అక్టోబర్‌లో టెండర్లను పిలిచింది. స్థానిక మున్సిపాలిటీలో ఈ పనులను క్యూబ్ సంస్థ దక్కించుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో రోజూ వచ్చే చెత్తను(సాలిడ్ వెస్ట్) ప్లాంటుకు మున్సిపాలిటీ వాహనాలతో పంపుతున్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులో ఉత్పత్తి అయిన పవర్‌ను పవర్ సప్లై కంపెనీలకు సంస్థ విక్రయించాలి. కానీ ఇప్పటిదాకా ఆ కంపెనీకి అన్ని సౌకర్యాలను కల్పించినా బయో ఎనర్జీ పనులు ముందుకు సాగలేదు.

తాజాగా జిగ్మా గ్లోబెల్ కంపెనీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్ 2లోపు శుభ్రం చేసే పనులను జిగ్మా గ్లోబెల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ కంపెనీ దక్కించుకుంది. మున్సిపాలిటీలో ఇప్పటిదాకా 13 వేల టన్నుల చెత్త పేరుకుపోయింది. ఈ కంపెనీనైనా గడువులోపు ఈ పనులు పూర్తి చేశానా అనేది అనుమానంగా మారింది. ఈవిషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా గతంలోని క్యూబ్ ప్రాజెక్టుకు సంబంధించి పనులు త్వరలో పూర్తికానున్నాయన్నారు. పట్టణంలో నిత్యం ఏడు టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు పంపుతున్నామని తెలిపారు. ఇప్పుడు టెండర్లు దక్కించుకున్న జిగ్మా కంపెనీ కేవలం డంపింగ్ యార్డులో పేరుకున్న చెత్తను శుభ్రం చేసేందుకు మాత్రమే పనిచేస్తుందన్నారు. అక్టోబర్ 2లోపు ఈ పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన మాట వాస్తవమేనని తెలిపారు.



దేవుని కొలువులో చిమ్మ చీకటి

- అంధకారంలో కీలపట్ల
- పుణ్యక్షేత్రంలో ఏంటీ ఈ పరిస్థితి



స్వామివారి ఆలయం ఎదురుగా వెలగని వీధి లైట్లు

గంగవరం: కీలపట్ల గ్రామంలో ఏంటీ ఈ పరిస్థితి. గతంలో ప్రారంభించిన 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభ దశలోనే త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో పాటు గ్రామంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడం, వీధి లైట్లు వెలగకపోవడంతో గ్రామంలో చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి. విద్యుద్దీపకాంతులతో కళకళలాడాల్సిన కీలపట్ల కోనేటిరాయస్వామి పురవీధుల్లో లైట్లు వెలగక కారు చీకట్లు కమ్ముకోవడంతో వీధులన్నీ అంధకారంలో ఉన్నాయి. రాత్రి వేళ అసలు అక్కడ గ్రామం ఉందా లేదా అనే పరిస్థితి నెలకొందంటూ అటు ప్రభుత్వం ఇటు విద్యుత్‌శాఖపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 4న గ్రామంలో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలో ఏ మాత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పుకొచ్చారు. అలా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించినా ఇప్పటివరకూ వీధి లైట్లు వెలగడం లేదు. అనేకమార్లు విద్యుత్ అధికారులకు ఈ విషయం గురించి గ్రామస్తులు విన్నవిస్తే పంచాయతీలోనే మీ సమస్య పరిష్కరించుకోవాలని తమకు సంబంధం లేదని విద్యుత్ అధికారులు తిరిగి గ్రామస్తులకు చెప్పినట్టు తెలిసింది. దీంతో గ్రామస్తులు మళ్లీ ఈ విషయంపై పంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా వీధి లైట్ల విషయంపై ఏ మాత్రం పట్టించుకోలేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కోనేటిరాయస్వామి వెలసిన ఈగ్రామంలో స్వామివారు విహరించే పురవీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడం అనర్థానికి దారి తీస్తుందని, దేవుని కొలువులో ఏంటీ దుస్థితి అంటూ గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారు. దేవుడు అన్నీ ప్రత్యక్షంగా చూస్తున్నారని లోపభూయిష్టంగా విధులు నిర్వహించే ఎవరినీ క్షమించరు అంటూ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు ప్రభుత్వ పెద్దలు కీలపట్లలో వీధి లైట్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంధకారంలో కీలపట్ల వీధి